జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 21-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 678 పేజీలు: 4 వెల : రూ.7

# సరుబుజ్జిలిలో ప్రభుత్వ భూములు.. కబ్జా!



* ఆక్రమణల్లో చెరువులు, రిజర్వు స్థలాలు
* అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానికుల ఫిర్యాదు
* పట్టించుకోని రెవెన్యూ అధికారులు
* ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సన్నద్ధమవుతున్న స్థానికులు

**సరుబుజ్జిలి, మే 20 (వార్త):** సరుబుజ్జిలి మండలం కేంద్రంలో ఉన్న చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. వందలాది విస్తీర్ణం గల చెరువులు బక్కచిక్కుతున్నాయి. కొందరు చెరువులను ఆక్రమించేస్తున్నా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణం. దీంతో రైతులకు సాగునీరు అందక ఇక్కట్లకు గురవుతున్నారు. అలాగే లేఅవుట్లలో వేసిన రిజర్వు స్థలాలు సైతం కబ్జాకు గురవుతున్నాయి. సరుబుజ్జిలిలోని చెరువులో కొందరు డంపింగ్ చేసి ఆక్రమిస్తున్నారు. వాటిలో మెల్లమెల్లగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఎటువంటి అనుమతుల్లేకుండా జరుగుతున్న కట్టడాలు కళ్లేదుటే జరుగుతున్నా రెవెన్యూ అధికారులకు కనీసం పట్టించుకోకపోవడం పట్ల వారికి కాసులు అందడంతోనే ఇలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ ఆక్రమణలపై కొందరు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖలు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్రమణలను వెంటనే తొలగించాలని, చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చెరువులు పరిరక్షించాలని కోరుతున్నారు.









## రాగోలు చెరువు ఆక్రమణలపై ధర్నా

**శ్రీకాకుళం:** రాగోలు గ్రామ పంచాయతీ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా పలు చెరువులపై ఆక్రమణలు పెరుగుతున్నాయని గ్రామ యువత, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 14 చెరువులు ఉండగా, సుమారు 140 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నీటి వనరులు ప్రస్తుతం క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువుల కట్టలు, పరిసర ప్రాంతాల్లో కొందరు అక్రమంగా మట్టిపోసి ఆక్రమణలు చేపడుతున్నారని, దీనివల్ల చెరువుల అసలు విస్తీర్ణం తగ్గిపోతోందని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆక్రమణదారులు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ యువత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాగోలు చెరువు వద్ద గ్రామస్థులు ధర్నా చేశారు. చెరువుల హద్దులను గుర్తించి రికార్డులను ప్రజలకు అందుబాటులో



# నీటి కోసం.. వనం నుంచి.. జనం లోకి..!

* కుక్కల దాడిలో పలు జింకలు మృతి
* పీర్లకొండపై నీటి కుంటలు లేక ఎండలకు అవస్థలు పడుతున్న వన్యప్రాణులు
* అటవీ శాఖ దృష్టి సారించాలంటున్న ప్రజలు



ఇచ్ఛాపురం, మే20 (వార్త):ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఇచ్ఛాపురంలోని పీర్లకొండపై ఉన్న వన్యప్రాణులు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. నీటి కొరత కారణంగా జింకలు ఆహారం, నీటి కోసం కొండ దిగివస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామాల సమీపానికి చేరుతున్న జింకలపై వీధి కుక్కలు దాడి చేసి చంపుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల పీర్లకొండ దిగువ ప్రాంతంలో కొన్ని జింకలు కుక్కల దాడికి గురై మృతి చెందినట్లు తెలిసింది. కొండపై నీటి వనరులు ఎండిపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి కొండపై తాగునీటి కుంటలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# అక్కడ జాతీయ రహదారే.. స్మశాన వాటిక

* కాలం మారినా... వీడని నిర్లక్ష్యం
* గ్రీవెన్స్‌లో ఓ యువకుడు ఫిర్యాదు
* స్థలం కోసం సర్వే చేసిన రెవెన్యూ అధికారులు
* స్మశాన వాటికకు స్థలం కేటాయించని వైనం
* కొలిక్కిరాని స్మశాన వాటిక ఏర్పాటు
* దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్న దాకరాపల్లి గ్రామస్థులు

**కంచిలి మే 20 (వార్త):** చంద్రమండలంపై ఇళ్ల నిర్మాణానికి మానవుడు సమాయత్తం అవుతున్న వేళ... భూమిపైనే సరైన సదుపాయాలు లేక ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కంచిలి మండలం దాకరాపల్లి గ్రామస్తుల దయనీయ పరిస్థితులు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఆ గ్రామంలో వ్యక్తి మృతి చెందితే స్మశాన వాటిక అందుబాటులో లేక జాతీయ రహదారి దాటుతూ దాని పక్కనే అంత్యక్రియలు నిర్వహించాల్సి రావడం వారి దుస్థితికి నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. మనిషి మరణిస్తే మృతదేహాన్ని నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారిని ఎంతో సాహసంతో దాటుకుంటూ కంచిలి వద్ద రహదారికి అనించి ఉన్న చిన్నపాటి ఖాళీ స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి చేరడానికి సుమారు రెండు కిలోమీటర్లకుపైగా నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి. సుమారు 150 నుంచి 200 కుటుంబాలు నివసిస్తున్న ఆ గ్రామంలో దశాబ్దాలు గడిచిన ఇప్పటికి స్మశాన వాటిక అధికారులు ఏర్పాటు చేయకపోవడం మన యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ దుస్థితిని గమనించిన గ్రామానికి చెందిన దైవప్రసాద్ పండిత్ అనే యువకుడు సుమారు ఏడాది క్రితం ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 297-3 లో గల 5.92 ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిలో ఖాళీగా ఉన్న 92 సెంట్లు కంచిలి రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్కు పంపించేందుకు నివేదిక సిద్ధం చేసినప్పటికీ అందులో స్మశాన వాటిక కోసం కేటాయించిన రెండు సెంట్లు స్థలం ఎక్కడ అనేది ఇంకా సస్పెన్స్‌గానే మారింది. ఈ నేపథ్యంలో దాకరపల్లి గ్రామంలో బుధవారం ఒక వ్యక్తి మృతి చెందడంతో జాతీయ రహదారి పక్కనే దహన సంస్కారాలు చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం ఈ సమస్యపై దృష్టి పెట్టి వెంటనే స్మశాన వాటిక స్థలాన్ని గుర్తించి హద్దులు చూపించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.



# సారా ప్యాకెట్లతో ఇద్దరి అరెస్టు



**సోంపేట, మే 20 (వార్త):** సారా ప్యాకెట్లు రవాణా చేస్తుండగా సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి బుధవారం నిర్వహించిన దాడుల్లో కంచిలి మండలం జలంత్రకోట సమీపంలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు.

అధికారుల సమాచారం మేరకు గతంలో సారావిక్రయాలు జరిపిన పాత నిందితులపై నిఘా పెట్టడంతో మళ్లీ అదే అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు గమనించారు. జలంత్ర కోట గ్రామానికి చెందిన రత్నాల అనసూయ వద్ద 100 సారా ప్యాకెట్లు, రత్నాల అర్జున నుంచి 150 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అలాగే వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

# గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- భూ సమస్యలు పరిష్కరించాలి**

**- ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్**




**మందస, మే 20(వార్త):** గిరిజన గ్రామాలలోని మంచి నీరు అందించి, రహదారులను నిర్మించాలని, అదేవిధంగా భూసమస్యలను పరిష్కరించాలని మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ వివిధ సమస్యలతో కూడిన వినపత్రాలను అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సవర గురునాథ్, సవర పాల్గుణరావు, నిమ్మక బృందావనం మాట్లాడుతూ బుడారసింగి పంచాయతీలోని నరసింగపురం గిరిజన గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని, నర్సింగపురం గ్రామానికి చెందిన స్మశాన స్థలం గిరిజనేతరులు ఆక్రమించుకోవడంతో గ్రామానికి స్మశానం లేకుండా చేశారన్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల అధికారులు స్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహల్పడ నుండి నరసింగపురం గ్రామం వరకు దట్టమైన వెదురు డొంకలు రోడ్డుకు ఇరువైపులా ఉండడంతో గ్రామానికి వెళ్లడం చాలా ఇబ్బందికరంగా ఉందని, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేయాలని, చీపి జంక్షన్ నుంచి మహల్పడ జంక్షన్ వరకు రోడ్డును నిర్మించి, రహదారి సౌకర్యం కల్పించాలని అన్నారు. నర్సింగపురం గ్రామంలో గతంలో ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని, వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే ఆగిపోయి ఉన్నాయని.. వెంటనే బిల్లులు చెల్లించి ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. నర్సింగపురంలో ఉన్న కొండ పోరంబోకు స్థలంలో కొంతమంది గిరిజనేతరులు ఒడిశా నుంచి వచ్చి, భూములను, పోడును ఆక్రమించుకుంటున్నారన్నారు. దర్యాప్తు చేసి మా గ్రామ పోడు భూముల పట్టాలకు మాకే పట్టాలు



మండలంలో ఉన్న గిరిజన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యాలు లేవని, సాబకోట పంచాయతీలోని మాణిక్యపట్నం గ్రామంలో మంచినీరు కోసం బోరు ఏర్పాటు చేయాలని, అనేకసార్లు విన్నవించుకున్న అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఒడిశా సరిహద్దు గ్రామాల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.


కార్యక్రమంలో సవర విప్రో, నిమ్మక బికారి, సారక జోగేష్, అభిమన్యు, సవర భాస్కరరావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులహ్వానం





**పలాస, మే 20 (వార్త):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అభ్యర్థులు https://itiadmissions.ap.gov.in/iti/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చునని, దరఖాస్తుల స్వీకరణకు జూన్ 30రాత్రి 11:59 గంటల వరకు సమయం ఉందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జులై 2 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత ప్రభుత్వ ఐటిఐ కేంద్రాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు ఒక ప్రకటన తెలిపారు.

## విషం తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి



**సారవకోట, మే 20(వార్త):** సారవకోట మండలం కిన్నెరవాడ గ్రామానికి చెందిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైరి సింహాచలం, సరస్వతి దంపతులు తమ కుమారుడు తేజేశ్వరరావు డబ్బుల విషయంలో అనుమానించాడని మనస్తాపానికి గురయ్యారు. దీంతో ఈ నెల 12న ఇరువురూ విషం తాగినట్లు తెలిసింది. స్థానికులు వెంటనే వారిని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బైరి సింహాచలం మంగళవారం మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్సై అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనం పట్టివేత



**జలుమూరు, మే 20(వార్త):** జలుమూరులోని చల్లవానిపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై బి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఈ చర్యలు చేపట్టారు. పలాస వైపు నుంచి కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంతకు పశువులను తరలిస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఆరు పశువులు ఉన్నట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. అక్రమ రవాణా అనుమానంతో పశువులను విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై వాహన డ్రైవర్ కరగాన తవిటయ్యపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఘనంగా మన్మధ జన్మదిన వేడుకలు



**పలాస, మే 20 (వార్త):** మార్గదర్శి, స్నేహశీలి, మొదలవలస మన్మధరావు ఘనంగా జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించారు. మన్మధరావు స్వగృహంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. "నమ్ముకున్న వారి కోసం నడుం బిగించే గుణం... అడిగిన వారికి లేదు అనకుండా సాయం చేసే దాతృత్వం... స్నేహానికి ప్రాణమిచ్చే నైజం... అన్నింటికీ మించి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి అప్పలరాజు అడుగుజాడల్లో నడుస్తూ, నాయకుడి మాటను జవదాటని నిజమైన నిబద్ధత గల వ్యక్తిత్వం మీది." ప్రముఖ కాంట్రాక్టర్, మా శ్రేయోభిలాషి మన్మధరావు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, సమాజానికి మరిన్ని సేవలు అందించాలని ప్రముఖ జర్నలిస్టులు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో పలాస నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ అధ్యక్షులు బమ్మిడి సంతోష్ కుమార్, జర్నలిస్టులు రమేష్ రవి, నంబల రమేష్, జోగారావు, వైసిపి నాయకులు, వైసిపి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



**ఇచ్ఛాపురం, మే 20 (వార్త):** నందమూరి తారక రామారావు(జూనియర్ ఎన్టీఆర్) జన్మదినం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఆఫీసులో జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ దుంగా శ్రీధర్, జిల్లా నందమూరి కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ మధుసూదన్ ఇచ్ఛాపురం 17వ వార్డు ఇంచార్జ్ జన్నెల సంతోష్ కుమార్ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ జయదేవ్ మరియు బుగత వినయ్ లు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా హెడ్ ఆఫీస్ లో జన్మదిన వేడుకలు లో ఘనంగా జిల్లా ప్రెసిడెంట్ సమక్షంలో జరిపారు.

## శ్రమజీవులను దోచేస్తున్న..

# మద్యం సిండికేట్

**- రోజుకు రూ.6 లక్షలు, ఏడాదికి రూ.21 కోట్ల దందా**

**-కూలీల కన్నీళ్లపై కాసుల వర్షం కురిపిస్తుంటే ప్రశ్నించే నాథుడేడీ?**

**-ప్రముఖ సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా)**



**పలాస, మే 20 (వార్త):** శ్రమజీవుల చెమటను మద్యం చుక్కలుగా మార్చి దోచేస్తున్న మద్యం సిండికేట్, రోజుకు రూ.6 లక్షలు, ఏడాదికి రూ.21 కోట్ల దందా చేస్తున్న, కూలీల కన్నీళ్లపై కాసుల వర్షం కురిపిస్తుంటే ప్రశ్నించే నాథుడే లేడని ప్రముఖ న్యాయవాది, ప్రముఖ సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్ (బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ దేశం పొదుపు నినాదంతో నడుస్తుంటే పలాస గడ్డపై మాత్రం శ్రమజీవుల బలహీనతలను మూలధనంగా చేసుకొని, మద్యం మాఫియా రోజుకు లక్షలు దండుకుంటోందని ఆరోపించారు. ఎమ్మార్పీ అంటే "మ్యాక్సిమమ్ రిటైల్ ప్రైస్" కాదు.. "మాఫియా రేటు ప్రైస్"గా మార్చేసి, రైతు, కూలీ, మత్స్యకారుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని న్యాయవాది దువ్వాడ శ్రీధర్ బాబా ఉద్యమ శంఖం పూరించారు.

### లెక్క తేలితే దోపిడీ.. లంచం ఇస్తే మౌనం

వైన్ షాపుల్లో బాటిల్‌కు ?20 అదనంగా రోజుకు 20,000 బాటిళ్లకు ?4 లక్షలు, బెల్ట్ షాపుల్లో ?40 అదనంగా 5,000 బాటిళ్లకు ?2 లక్షలు కలిపి రోజుకు ?6 లక్షలు దోపిడీ జరుగుతోందని, దీంతో నెలకు ?1.80 కోట్లు, ఏడాదికి ?21 కోట్లు, 5 ఏళ్లకు ?100 కోట్లు శ్రమజీవుల జేబుల నుంచి సిండికేట్ గల్లాపెట్టెలోకి చేరుతోందని వాపోయారు. "రోజంతా కాలిపోయి ?500 కూలి తెస్తే అందులో ?150 అదనపు రేటుకే పోతోందని, వాడి బిడ్డలకు పుస్తకం లేదు.. కానీ మాఫియాకు మాత్రం బెంజ్ కార్లు. ఈ ?100 కోట్లతో ఉద్దానంలో 10 పరిశ్రమలు పెడితే 5 వేల కుటుంబాలు బతుకుతాయి" అని శ్రీధర్ బాబా లెక్కలతో సహా ఎండగట్టారు.

### పలాస ఎమ్మెల్యే మౌనం

ఈ బహిరంగ దోపిడీపై స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడమే ఇప్పుడు అసలు చర్చ. "ఎమ్మెల్యే .. మీ ఒక్క సంతకం చాలు.. తక్షణమే ఎమ్మార్పీ అమలవుతుందని తెలిపారు. ఒక్క ఫోన్ కాల్ చాలు.. బెల్ట్ షాపులు మూతపడతాయని, ఆ సంతకం పెట్టడానికి కలం కరవైందా.. లేక మరేదైనా కారణం ఉందా? కూలీల ఉసురు తగులుతుందనే భయం లేదా? మీ మౌనం మాఫియాకు ఇచ్చిన లైసెన్స్ లాగే ఉంది. ఓట్లు వేయించుకున్న ప్రజల కష్టాన్ని పట్టించుకోకపోతే అది నమ్మకద్రోహం కాదా? ప్రజల కోసం నిలబడతారా.. సిండికేట్ కోసం మౌనంగా ఉంటారా.. తేల్చి చెప్పండి!" అంటూ శ్రీధర్ (బాబా) సూటిగా నిలదీశారు.

### "బోర్డు మీద చట్టం.. బిల్లులో దోపిడీ"

ఎమ్మార్పీ బోర్డులు పెట్టి దాని కిందే అదనపు వసూళ్లు చేయడంపై ఆయన మండిపడ్డారు. "చట్టం పుస్తకాల్లో నిద్రపోతోంది.. మాఫియా మాత్రం రోడ్డు మీద రాజ్యమేలుతోందని ఘాటుగా విమర్శించారు. ఎక్సైజ్ అధికారులకు కళ్లు ఉన్నాయా? నెల నెలా మామూళ్లు అందుతుంటే దాడులు ఎందుకు చేస్తారు?అని, శ్రమజీవుల బలహీనతను ఆదాయ వనరుగా మార్చేసిన ప్రతి ఒక్కడి లెక్క తేలుస్తామని హెచ్చరించారు.!" ఇకపై యుద్ధమే.. శపథం ఇదేనని,"రేపటి నుంచి ప్రతి షాపు ముందు మా టీం ఉంటుందని, ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా వీడియో తీసి కలెక్టర్‌కు, హైకోర్టుకు పంపుతామని, షాపుల ముందు నిరాహార దీక్షలు, కలెక్టరేట్ ముట్టడి తప్పదు. కూలీల కన్నీళ్లు నీళ్లు కావు.. అవి నిప్పు రవ్వలు. ఆ నిప్పు తగిలితే కుర్చీలే కాదు.. కూలీలు కూడా మిగలరు!. ఎమ్మార్పీ చట్టం ప్రజల కోసం తప్ప దళారుల కోసం కాదని, తేడా వస్తే తాట తీస్తామని, సిండికేట్ సామ్రాజ్యాన్ని కూల్చే వరకు ఈ శ్రీధర్ విశ్రమించడు!" అని ఆయన ప్రకటించడంతో పలాసలో రాజకీయ, మద్యం వర్గాలు ఉలిక్కిపడ్డాయన్నారు. ప్రతి బాటిల్ ఎమ్మార్పీకే అమ్మాలని, 48 గంటల్లో బెల్ట్ షాపులు కూల్చేయాలని, ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ పెట్టాలని, గత 5 ఏళ్ల దోపిడీపై విచారణ జరిపి సొమ్ము తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు.

# సుందరయ్య సేవలు చిరస్మరణీయం



**మందస, మే 20(వార్త):** పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావడమే కామ్రేడ్ సుందరయ్య ఇచ్చే ఘనమైన నివాళులని వక్తలు అన్నారు. కామ్రేడ్ సుందరయ్య 41వ వర్ధంతి సభ టొంప లక్ష్మీనారాయణ అధ్యక్షతన మందస పట్టణంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడు, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాత, తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నేత కామ్రేడ్ సుందరయ్య అన్నారు. ఆయన తన యావత్ జీవితాన్ని సమస్త ప్రజలకు అంకితం చేసిన ఒక గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కామ్రేడ్ సుందరయ్య జమీందారీ వ్యతిరేక పోరాటాన్ని, తెలంగాణ సాయుధ పోరాటం నిర్మించి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన పోరాట యోధుడని కొనియాడారు. నేటి ప్రభుత్వ పాలకలు ప్రజల భూములను కొల్లగొట్టి కార్పొరేట్ కంపెనీలకి కట్టబెట్టడానికి పూనుకుంటున్నారని దీనికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులను కొల్లగొట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి పూనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా విధ్వంసం చేసే అను విద్యుత్ కేంద్రాన్ని రద్దు చేయాలని, కార్గో ఎయిర్ పోర్ట్ ప్రతిపాదన రద్దు చేయాలని, సరుబుజ్జిలి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదన రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని, సముద్రతీర ప్రాంతాన్ని అదాని వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్ట పెట్టొద్దని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమర సీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సవర గురునాధ్, సవర విప్రో, ఆర్.దిలీప్ కుమార్, ఎం.ధర్మారావు, పి.దేవేంద్ర కె.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరులను స్మరించుకుందాం!

**పలాస, మే 20 (వార్త):** శ్రీకాకుళ సాయుధ పోరాట అమరవీరులను స్మరించుకుందామనిఅమరవీరుల స్మారక సభ కమిటీ కన్వీనర్ పోతనపల్లి కుసుమ, జోగి కోదండరావు, వంకల మాధవరావులు పిలుపునిచ్చారు. పలాస మండలం, బొడ్డపాడులోని అమరవీరుల స్మారక భవనం వద్ద బుధవారం 37వ అమరవీరుల స్మారక సభ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్మారక కమిటీ ప్రతినిధులు ఈ కరపత్రాన్ని విడుదల చేశారు. ?ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల మే 27న ఉదయం 10 గంటలకు బొడ్డపాడు గ్రామంలో నిర్వహించ తలపెట్టిన 37వ అమరవీరుల స్మారక సభను ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళ సాయుధ పోరాట అమరుల ఆశయాలను స్మరించుకుంటూ, ప్రస్తుత దేశీయ పరిస్థితుల్లో కార్పొరేట్ - హిందూ మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడటమే ఆ అమరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు. 1969 మే 27న జరిగిన తొలి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తి, బైనపల్లి పాపారావు, దున్న గోపాలరావు, నిరంజన్ సాహూ, రామచంద్ర ప్రధానో, శృంగవరపు నరసింహులుతో పాటు ఏడుగురు కామ్రేడ్స్ ప్రాణాలర్పించారని కమిటీ గుర్తుచేసింది. వారి స్ఫూర్తితో 1990లో కమ్యూనిస్టు పార్టీలు, బొడ్డపాడు, ఉద్దాన ప్రాంత ప్రజల సహకారంతో ఈ స్మారక భవనాన్ని నిర్మించామని, అప్పటి నుండి ప్రతి ఏటా మే 27న ఈ స్మారక సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దిల రామారావు, కోనేరు రమేష్, గోరకల



జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## శక్తి యాప్‌పై అవగాహన సదస్సు

**నరసన్నపేట, మే 20 (వార్త):** నరసన్నపేట మండలం తామరపల్లిలో ఉపాధి హామీ పనుల వద్ద బుధవారం శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డివిజన్ శక్తి టీం-4 హెడ్ కానిస్టేబుల్ గిరిధర్ పాల్గొని ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల, బాలికలకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని తెలిపారు. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పోలీసుల సహాయం పొందేందుకు ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

అత్యవసర సమయాల్లో ఈ యాప్ ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే నేషనల్ హైవేలు, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, స్థానికులు పాల్గొన్నారు.




## ఆన్‌లైన్ మెడిసిన్ వ్యాపారాన్ని రద్దు చేయాలి



**సోంపేట, మే 20(వార్త):** ప్రజలను డిస్కౌంట్ ల పేరుతో మభ్యపెట్టి ఇష్టారాజ్యంగా నిబంధనలు అతిక్రమించి సాగిస్తున్న ఆన్లైన్ మందుల వ్యాపారాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ పిలుపుమేరకు సోంపేట అసోసియేషన్ బుధవారం సోంపేటలో మెడికల్ షాపుల బంద్ పాటించింది. దేశవ్యాప్తంగా పాటిస్తున్న బందులో భాగంగా ఇక్కడ కూడా దుకాణాలు బందు చేసినట్లు స్థానిక అసోసియేషన్ అధ్యక్షులు వజ్జ కృష్ణారావు తెలిపారు. నిత్యవసర సరుకులు మాదిరిగా ప్రజలకు అవసరమైన మందులను ఆన్లైన్లో వ్యాపారం చేయడం ప్రజారోగ్యానికి పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. డిస్కౌంట్ ల పేరుతో మార్కెట్లో అనారోగ్యమైన పోటీ వాతావరణం సృష్టించి దశాబ్దాలుగా వ్యాపారాలు నిర్వహిస్తున్న మెడికల్ షాపులను దెబ్బతీయాలనుకోవడం తగదని హెచ్చరించారు. మెయిన్ రోడ్ లో ముందుగా నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో డిటి మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సురేష్ సానా శ్రీనివాస్ పాలిశెట్టి రవి సానా మురళి ప్రభాకర్ శ్రీనివాసరావు రామరాజు గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ పైడిశెట్టి రమేష్ డాక్టర్ జోగి నాయుడు డాక్టర్ మంచు ప్రదీప్ కుమార్ డాక్టర్ దుర్యోధన డాక్టర్ వెంకటేష్ సంఘీభావం తెలిపి, పాల్గొన్నారు.



# అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ ఆందోళన

**- పలాస పీఏసీఎస్‌లో అవినీతిని తేలుస్తాం**

**-సమగ్ర విచారణ చేపడతాం**

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, మే 20 (వార్త):** పలాస నియోజవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షమైన వైసిపి కుట్రలు చేస్తుందని, పలాస పిఏసీఎస్ లో గత 2005 నుండి 2024 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో పెద్దఎత్తున ఆర్థిక అవినీతి జరిగిందని, సమగ్ర విచారణ చేపడతామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. పలాసలో టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌతు శిరీష మాట్లాడుతూ పిఏసీఎస్ సభ్యుల అనుమతి లేకుండా కొంతమంది పేర్లతో లక్షల రూపాయల రుణాలు వాడుకున్నట్లు ఆమె దృష్టికి వచ్చిందన్నారు. సంఘంలో లేని బయట వ్యక్తుల బినామీ పేర్లతో భూమి పత్రాలు, సరైన డాక్యుమెంట్లు లేకుండానే రుణాలు మంజూరు చేసినట్లు తెలిసిందని ఆమె తెలిపారు. పలాస పిఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి 1.5 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినప్పటికీ, అధికారుల అనుమతి లేకుండా అదనంగా 35 లక్షల రూపాయలు సంబంధిత కాంట్రాక్టర్ కు చెల్లించినట్లు ఉందని, అయితే ఆ 35 లక్షల రూపాయలు ఎవరి జేబుల్లోకి వెళ్ళాయో తెలియాల్సిఉందన్నారు. అన్నీ కలుపుకుని పలాస పిఏసీఎస్ లో సుమారు 5 కోట్ల 50 లక్షల రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపిన ఎమ్మెల్యే గౌతు శిరీష, అవినీతికి పాల్పడ్డవారందరి పేర్లను తీస్తా, అందరి లెక్కలు తేలుస్తానన్నారు. కూటమి ప్రభుత్వంలో పలాస నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు కళ్లముందే కనిపిస్తున్నాయని, గత రెండేళ్ల పాలనలో పలాస మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అద్భుతమైన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష మండిపడ్డారు.? పలాస నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని వేగంగా పూర్తి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. పలాస మున్సిపాలిటీకి కానుకగా ఇవ్వబోతున్న ఆర్ఓబీ పనులు మరికొద్ది నెలల్లోనే పూర్తి కానున్నాయని తెలిపారు. కేంద్రీయ విద్యాలయం రానే రాదని గతంలో కొందరు విమర్శలు చేస్తూ సూదికొండ వద్ద డ్రామాలు ఆడారని, కానీ నేడు తాత్కాలిక పాఠశాలలో తరగతులు ప్రారంభం కావడమే కాకుండా, శాశ్వత భవనం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించిందని తెలిపారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో 'సాగరమాల' ప్రాజెక్టు ద్వారా మత్స్యకార గ్రామాల్లో సౌర శక్తితో విద్యుత్ కాంతులు విరజిల్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గతంలో ఆయనను 'బెంచీల మంత్రి' అని ఎగతాళి చేసిన వారికి ఇదే సమాధానమని ఎద్దేవాచేశారు. గత ?వైసిపి పాలనలో మత్స్యకారులను తీవ్రంగా వంచించారన్న విషయాన్ని మర్చిపోకుండా ముందే మంత్రి తన పనితీరుతో సమాధానం చెప్పారని తెలిపారు. నువ్వలరేవు, మంచినీళ్లపేట వంటి ప్రాంతాలలో సుమారు 321 మంది మత్స్యకారులకు అందాల్సిన 'మత్స్యకార భరోసా' ను గత ప్రభుత్వం నిలిపివేసిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా రెట్టింపు మత్స్యకార భరోసాతో ప్రతి ఒక్కరినీ ఆదుకుంటోందని స్పష్టం చేశారు.

?"గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 41 వరకు పెంచడమే కాకుండా, ఏకంగా 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం వేశారన్నారు. ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 'ట్రూ డౌన్ ఛార్జీలు' (ట్రూ డౌన్ చార్జస్) అమలు చేస్తూ, ఈ ఐదేళ్లలో రూపాయి కూడా కరెంట్ బిల్లు పెంచబోమని బల్లగుద్ది చెపుతున్నానన్నారు.?గత వైసిపి హయాంలో దళితులపై జరిగిన దాడులు, అన్యాయాలను ప్రజలు ఎన్నటికీ మరువరన్న ఎమ్మెల్యే అన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ ఆత్మహత్య ఉదంతం, వైసిపి ఎమ్మెల్సీ చేత దారుణ హత్యకు గురై డోర్ డెలివరీ చేయబడిన దళిత యువకుడు సుబ్రహ్మణ్యం కేసులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రశ్నించిన యాదగిరి అనే దళితుడిపైనే దళిత అట్రాసిటీ కేసు పెట్టించిన ఘనత వైసిపి నాయకులదని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఇళ్లు ఉన్న వీధుల్లో రోడ్లు కూడా వేయకుండా వివక్ష చూపించిన నీచ చరిత్ర గత ప్రభుత్వానిదని ధ్వజమెత్తారు.?నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలే మరోసారి బుద్ధి చెప్తారని, చంద్రబాబు నాయుడుపై, కూటమి ప్రభుత్వంపై ఆధారాలు లేకుండా మాట్లాడితే ప్రజల దృష్టిలో వైసిపి నేతలే నవ్వులపాలు అవుతారని హెచ్చరించారు. గత ఐదేళ్ల వైసిపి పాలన అరాచకాలతో నిండిపోతే, కూటమి ప్రభుత్వంలో ప్రతి చేతికీ పని, ప్రతి చేనుకీ నీరు అందిస్తూ పలాస ను 'సేఫ్ పలాస' (సేఫ్ పలాస) గా మార్చేందుకు ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. వైసిపి నేతలకు దమ్ముంటే వారి హయాంలో మత్స్యకారులకు చేసిన మేలు ఏంటో, పలాసలో చేసిన అభివృద్ధి ఏంటో సాక్ష్యాలతో సహా నిరూపించాలని ఆమె సవాల్ విసిరారు. ఈ సమావేశం లో పిఏసియస్ అధ్యక్షులు కణితి సురేష్, వంకల కూర్మారావు, డి.భాష్కరరావు, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ యంత్ర పరికరాలకు ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు పెంపు

**- మండల వ్యవసాయధికారి దానకర్ణుడు**

**మెళియాపుట్టి, మే 20(వార్త):** రైతులు వ్యవసాయ యంత్ర పరికరాలకు వ్యక్తిగతంగా దరఖాస్తు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ గడువు పెంచడం జరిగిందని మండల వ్యవసాయధికారి యస్.దానకర్ణుడు తెలిపారు.ఈ నెల 26వ తేదీ లోపు వ్యవసాయ యంత్రపరికరాల కొరకు రైతులు ఆన్లైన్లో విధిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా స్ప్రేయర్లు, పవర్ విడర్లు, పవర్ టెల్లర్లు, దుక్కి నాగలి, దుమ్ము నాగలి, కేస్ వీల్స్, రోటవేటర్లు, ట్రాక్టర్లు మొదలగు యంత్ర పరికరాలకు ఈ నెల 26వ తేదీ లోపు ఆన్లైన్లో విధిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తదుపరి వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను లాటరీ విధానం ద్వారా జిల్లా ఇన్చార్జ్ మంత్రి మరియు జాయింట్ కలెక్టర్ వారు లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని, తదుపరి రైతులు వారి వాటాగా చెల్లించిన తదుపరి విధిగా యంత్ర పరికరాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరు వినియోగించుకోవాలని, ఇంకా ఏదైనా పూర్తి సమాచారం కొరకు ఆయా స్థానిక రైతుసేవా కేంద్రాలని సంప్రదించాలని కోరారు.



## 'ఆక్రోశంతోనే అప్పలరాజు విమర్శలు'



**పలాస, మే 20 (వార్త):** గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తమ చేతకానితనంతో నియోజకవర్గాన్ని వెనుకబాటుకు గురిచేసి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అసూయ, ఆక్రోశంతో విమర్శలు చేస్తున్నారని పలాస నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా నాయకుడు విజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి వ్యాఖ్యలపై ఘాటుగా కౌంటర్ ఎటాక్ చేశారు. అధికారంలో ఉండి ఏం చేశారు? అని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాటు మంత్రిగా సర్వాధికారాలు అనుభవించిన అప్పలరాజు పలాస నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. నాడు ఉద్దానం ప్రాంత సమస్యలను, నియోజకవర్గ ప్రగతిని పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. సొంత లాభాలు, రాజకీయ ప్రతీకారాలకే ప్రాధాన్యత ఇచ్చి, పలాస అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిన ఘనత అప్పలరాజుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. "నాడు అధికారంలో ఉండి ఏమీ చేయలేని చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే.. నేడు పలాసలో జరుగుతున్న అభివృద్ధిపై అప్పలరాజు బురదజల్లుతున్నారు. కూటమి ప్రభుత్వ ప్రగతిని చూసి తట్టుకోలేకపోతున్నారు. అప్పలరాజు ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, పలాస నియోజకవర్గంలో నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని విజయ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతుంటే, ఆ విజయాలను చూసి తట్టుకోలేక మాజీ మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

### సోషల్ మీడియాలో నిలదీస్తాం

వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా, సోషల్ మీడియా వేదికగా వారి అబద్ధాలను తిప్పికొడతామని విజయ్ హెచ్చరించారు. ప్రజలంతా నిజానిజాలను గమనిస్తున్నారని, అప్పలరాజు ఇప్పటికైనా హుందాగా వ్యవహరించకపోతే ప్రజలే పాతాళానికి తొక్కి బుద్ధి చెబుతారని హితవు పలికారు. పలాసను ప్రగతి పథంలో నిలపడమే తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా శిరీష లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## పోషకాహారంతో స్కేటింగ్ క్రీడాకారులకు ప్రోత్సాహం




**పలాస, మే 20 (వార్త):** పలాస పట్టణంలో నిర్వహిస్తున్న స్కేటింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా స్కేటింగ్ విద్యార్థులకు బుధవారం పోషకాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా రోల్ బాల్ సంఘం అధ్యక్షుడు మల్ల రామేశ్వరం, శ్రీకాకుళం జిల్లా రోలర్ స్పోర్ట్స్ సంఘం కార్యదర్శి బి. చంద్రావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కేటింగ్ విద్యార్థులకు గుడ్లు, అరటిపండ్లు వంటి పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్ల రామేశ్వరం మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు పోషకాహారం తీసుకోవడం చాలా అవసరమని తెలిపారు. మంచి ఆహారం వల్ల శారీరకంగా, మానసికంగా ఎదుగుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బి. చంద్రావతి మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు క్రీడాకారుల శరీరాన్ని దృఢంగా తయారు చేస్తాయని, దీని ద్వారా వారు తమ లక్ష్యాలను చేరుకుని ఉన్నత స్థాయికి ఎదగగలరని అన్నారు.

మే 31న సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కేటింగ్ కోచ్ గోపాల కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## దామోదరసాగరం రిజర్వాయర్ పనుల్లో కదలిక

**- కుడి కాలువను పరిశీలించిన అధికారులు**

**-క్షేత్రస్థాయిలో పర్యటించిన టీడీపీ నాయకులు**

**మందస, మే 20(వార్త):** దామోదర సాగరం రిజర్వాయర్ పనుల్లో కదలిక మొదలయ్యింది. మందస మండలంలోని నర్సింగపురం పంచాయతీ దేవుపురం గ్రామం సమీపంలో గల దామోదరసాగరం రిజర్వాయర్. ఇది పేరుకు మాత్రమే అన్న చందాన తయారైంది. రైతులకు కలగా మిగిలింది. ఈ తరుణంలో రిజర్వాయర్ కాలువ పనులను చేయడానికి అధికారులు పరిశీలనకు వచ్చారు. జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.వి.శ్రీనివాసరావు దామోదరసాగరం రిజర్వాయర్ కుడి కాలువకు సంబంధించి పనులు చేయడానికి పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు దామోదర సాగరం కుడి కాలువను పరిశీలించడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి, రైతులకు సాగునీరు అందించే కీలకమైన ఈ రిజర్వాయర్ ను బాగు చేయనున్నట్టు తెలిపారు. ప్రతీ రైతుకూ సాగునీరు అందడమే లక్ష్యంగా, కాలువల మరమ్మతులు, నీటి యాజమాన్య పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో కాలువ పరిస్థితిని, నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో జలవనరులశాఖ ఇంజనీరింగ్ అధికారులతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, క్లస్టర్ ఇంచార్జ్ ముంజేటి చంద్రశేఖర్, అగ్గున జయరాజు, దొక్క లక్ష్మినారాయణ, రైతులు, కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





## ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు

**పోలాకి, మే 20 (వార్త):** పోలాకి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లకు త్వరితగతిన మరమ్మతులు చేపడుతున్నట్లు ఎంఈఓ-2 ఎస్. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పాఠశాలల్లో మొత్తం 28 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ప్లాంట్లు సాంకేతిక లోపాలతో పనిచేయకపోవడంతో వాటి మరమ్మతులకు చర్యలు ప్రారంభించినట్లు వివరించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ప్రధాన లక్ష్యమని, అందుకోసం అన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే పాఠశాలల్లో విద్యార్థులకు తిరిగి శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఆన్‌లైన్ విధానానికి వ్యతిరేకంగా మెడికల్ షాపుల నిరసన ర్యాలీ

**నరసన్నపేట, మే 20(వార్త):** నరసన్నపేటలోని మెడికల్ దుకాణాల యాజమాన్యాలు, కెమిస్టులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానంతో చిన్న మెడికల్ షాపులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన కెమిస్టులు, చిన్న వ్యాపారులపై అధిక ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానాల కారణంగా వ్యాపార నిర్వహణ కష్టతరంగా మారుతోందని వాపోయారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఎంఆర్వో సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. చిన్న మెడికల్ దుకాణాలను పరిరక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు మెడికల్ షాపుల నిర్వాహకులు, కెమిస్టులు పాల్గొన్నారు.



## ఘనంగా సుందరయ్య వర్ధంతి




**కంచిలి, మే 20 (వార్త):** కంచిలి మండలం బూరగం గ్రామంలో మంగళవారం రాత్రి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తారకేశ్వరరావు మాట్లాడుతూ ఈరోజు దేశంలో ఉండే రాజకీయ పరిస్థితులు రాజకీయ నాయకులు యొక్క నడవడిక చూస్తూ ఉంటే అసహ్యంగా ఉందని పేర్కొన్నారు. సుందరయ్య అప్పట్లోనే ప్రతిపక్ష నాయకునిగా, శాసనసభ సభ్యునిగా అనేక ఆదర్శవంతమైనటువంటి జీవితాన్ని గడిపారు. ఆ జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని ఆయన యువతీ యువకులకు కోరారు. ఆయన జీవితం నేటికీ ఆదర్శవంతమని పార్లమెంట్ కి సైకిల్ మీద వెళ్లేవారని ఆయన యావదాస్తి కమ్యూనిస్టు పార్టీకి రాసిచ్చిన ఘనతని అలాగే గ్రామాల్లో అస్పృశ్యత నిరక్షరాస్యత నివారణకు అనేక కార్యక్రమాలు చేపట్టి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన మహా నాయకుడిని వక్తలు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాజు,డాట్ల జనార్ధన్, చిన్నారావు భవన నిర్మాణ కార్మికులు రైతులు నీరజ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# షర్మిళ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

**జలుమూరు, మే 20 (వార్త):** విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్ షర్మిళ సమక్షంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు సహకారంతో ఈ చేరికలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయుడుగారి రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతితో నిండిపోయాయని ఆరోపించారు. 2029 ఎన్నికల్లో మార్పు కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. తాను సామాజిక కార్యకర్తగా, శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేస్తున్నానని తెలిపారు. గతంలో బీఎస్పీ తరపున శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం ఉందన్నారు. అలాగే యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్‌గా పదేళ్లుగా సేవలందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీష్, శ్రీముఖలింగం మాజీ ఉపసర్పంచ్ మరియు జలుమూరు జూనియర్ కళాశాల మాజీ చైర్‌పర్సన్ అయిన గుంట కర్ణవీరుడు, రిటైర్డ్ ఆర్మీ హవల్దార్ కంచరపు తేజేశ్వరరావు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల, ఆర్థిక సమస్యలపై ప్రభుత్వాలు సమర్థవంతంగా స్పందించడం లేదని నాయకులు విమర్శించారు. సమ్మిళిత అభివృద్ధి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు.





## సర్‌లో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించండి

**ఇచ్ఛాపురం, మే 20 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ లను నియమించాలని వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ శ్రీవారి కి వివరాల జాబితా మరియు ఫారలను సబ్మిట్ చేశారు.భారత ఎన్నికల సంఘం ఆదేశాలు మరియు మార్గదర్శకాల ప్రకారం, ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమానికి సంబంధించి, మా యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించడం జరిగినదని ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని అన్ని పోలింగ్ స్టేషన్ల వారీగా నియమించబడిన మా పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల పూర్తి వివరాలతో కూడిన ఫారాలను లేఖతో పాటు జతపరచి మీకు సమర్పిస్తున్నట్లు చెప్పారు.ఫారాలను స్వీకరించి, మా పార్టీ ఏజెంట్లను బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే ఓటర్ల నమోదు,సవరణలు మరియు ఇతర ఎన్నికల విధులలో అధికారికంగా భాగస్వామ్యం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పైల దేవదాస్ రెడ్డి, ప్రకాష్ రావు పట్నాయక్, ఆశి కృష్ణ రెడ్డి, ఆశి పురుషోత్తం రెడ్డి, చాట్ల తులసి దాస్ రెడ్డి, బర్ల నాగభూషణం రెడ్డి, కారింగి మోహన్ రావు, సాలిన గాంధీ, చల్ల దేవరాజు, పిట్ట ఆనంద్ రెడ్డి, గణప సింహాచలం, దక్కత నూకయ్య రెడ్డి, బాకీ లక్ష్మినారాయణ రెడ్డి, వడ్డీన తేజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రామయ్యపట్నంలో ఉద్రిక్తత .. అటవీ సిబ్బంది తీరుపై ఆగ్రహం

**సోంపేట, మే 20(వార్త):** అటవీ శాఖ సిబ్బంది తీరు పట్ల రామయ్య పట్నం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పరిసరాల్లో పూర్వం నిర్మించుకున్న అమ్మవారి ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి అటవీశాఖ సిబ్బంది అడ్డుతగులుతున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం సెక్షన్ ఆఫీసర్ బిందు, గార్డ్ సంతోష్ కలిసి గ్రామానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడను జెసిబి తో తొలగిస్తామని సిబ్బంది హెచ్చరించడంతో గ్రామస్తులంతా వారిపై ఆగ్రహంతో తిరగబడ్డారు. పూర్వం తాతలు ముత్తాతల కాలం నుంచి ఈ గ్రామం నిర్మాణం జరిగిందని గ్రామం చుట్టూ ఆలయాలు నిర్మాణం జరిగిందని ఇప్పటివరకు ఎటువంటి సమస్యలు లేకపోయినా ఆక్రమణల పేరిట అటవీశాఖ అనవసరమైన రాద్ధాంతం చేస్తుందని సిబ్బంది తీరును గ్రామస్తులు తప్పుపట్టారు. దీనిపై ఇరు వర్గాల మధ్య తీవ్రవాదోపవాదాలు జరిగాయి. ఆక్రమణలు సహించేది లేదని అటవీ సిబ్బంది హెచ్చరించగా తమ నిర్మాణాలపై చేయి వేస్తే తామేంటో చూపిస్తామని మత్స్యకారులు దీటుగా సమాధానం ఇచ్చారు. జనం అధికంగా తరలి రావడంతో సిబ్బంది పలాయనం చెత్తగించారు. దీనిపై ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మాజీ ఎంపీటీసీ సభ్యుడు నిట్ట గోపాల్ పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలకు సముద్రపు ఒడ్డున భూములు కట్టబెట్టడానికి అటవీ రెవెన్యూ శాఖలు చేస్తున్న కుతంత్రమని ఆరోపించారు.



## రూ.4 కోట్లతో నూతన బీటీ రోడ్డుకు శంకుస్థాపన

**సరుబుజ్జిలి, మే 20 (వార్త):** తెలికి పెంట పంచాయతీ పరిధిలో అగ్రహారం గ్రామం నుంచి సిద్ధాంతం గ్రామం వరకు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రహదారికి ఆమదాలవలస శాసనసభ్యులు, పియుసి చైర్మన్ కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో అవసరమని తెలిపారు. ఈ బీటీ రహదారి నిర్మాణం పూర్తయితే అగ్రహారం, సిద్ధాంతం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడటంతో పాటు విద్యార్థులు, రైతులు, ప్రజలు సులభంగా ప్రయాణించగలరని పేర్కొన్నారు.ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు అంబల్ల. రాంబాబు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి నందివాడ గోవిందరావు, పురుషోత్తపురం నీటి సంఘం అధ్యక్షులు కిల్లి లక్ష్మి గోవింద , మండల తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, ఎండ రామారావు, కోటి కుప్పల కోటేశ్వరరావు, చిన్నాల అప్పారావు, అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అనుమానితులు కనిపిస్తే సమాచారం అందించాలి



**పలాస, మే 20 (వార్త):** అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి చెప్పారు. గంగువాడ గ్రామాన్ని బుధవారం రాత్రి పోలీసులు సందర్శించారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు తెలియజేయాలని కోరారు. ఇలాంటి సమయంలో కొత్తగా కనిపించే వ్యక్తుల కదలికలను గమనించాలని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే పోలీసులకు చెప్పాలని, ఎవరికైనా అద్దె ఇల్లు ఇచ్చేటప్పుడు వారి వివరాలు తీసుకోవాలని ప్రజలను కోరారు.

అవసరమైతే డయల్ 100కు కాల్ చేయాలని, నారీ శక్తి గురించి, కొత్త చట్టాల గురించి రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అవగాహన కల్పించి, గ్రామంలో దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు ఏమైనా ఉంటే వాటికి సీసీ కెమెరాలు అమర్చమని, గ్రామంలో ఏమైనా పండుగలు గాని, ఉత్సవాలుగాని జరిగినప్పుడు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వమనిలని కోరారు. సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, పేకాట, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా, అమ్మకం గురించి అవగాహన కల్పించి, బాల్యవివాహాలు, మహిళలపై జరుగు నేరాలు, 112 కాల్ ఉపయాగం, మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాలు ప్రబలినా.. వైద్య సేవల్లో అలసత్వమేల?



### - మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**మెళియాపుట్టి, మే 20(వార్త):** ఊరంతా ప్రజలకు జ్వరాలు ప్రబలి అనారోగ్యం పాలై ఇబ్బందులు ఎదుర్కొంటుండడంలో వైద్య సేవలు అందించడంలో ఎందుకు అలసత్వం చేశారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైద్యాధికారులకు ప్రశ్నించారు. గొట్టిపల్లి గిరిజన గ్రామంలో ఇటీవల కాలంగా జ్వరాలు ప్రబలి గ్రామస్తులంతా జ్వర పీడితులుగా ఉన్న నేపథ్యంలో ఎందుకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం చేశారని గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారి కి ఐజి ఎమ్మెల్యే ప్రశ్నించారు. దీంతో గ్రామంలో రక్త పరీక్షలు నిర్వహించి వారికి వైద్య సేవలు అందిస్తున్నామని, అలాగే ప్రస్తుతం ఊరంతా ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించి వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడంతో పాటు ఈ దినము నుండి ఐదు రోజులపాటు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి ప్రతి ఒకరికి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.



## ఎంపీటీసీల గౌరవ వేతనాలకు న్యాయ పోరాటం

### -సుమారు రూ.లక్షవరకు బకాయిలు

### -ధ్వజమెత్తిన మందస ఎంపీటీసీలు

### - సాదాసీదాగా మందస మండల సమావేశం

**మందస, మే 20(వార్త):** మందస మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సర్పంచ్ ల పదవీకాలం ముగియడంతో వారంతా హాజరు కాలేదు. కోరం ఏర్పడడానికి కాస్తా సమయం పట్టగా.. తూతూ మంత్రంగానే సమావేశం కొనసాగింది. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీటీసీలకు అందాల్సిన గౌరవ వేతనం అందడంలేదని, సుమారు రూ.లక్ష వరకు బకాయిలు ఉన్నాయని పలువురు ఎంపీటీసీలు సమావేశంలో అన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ పట్టుబట్టారు. ఒక్కొక్కరికీ సుమారు రూ.లక్ష వరకు గౌరవ వేతనములు బకాయిలుండడం విచారకరమన్నారు. దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఎంపీడీవో ఈ విషయంపై వివరణ ఇవ్వాలని పట్టుబట్టారు. గౌరవ వేతనాలు అందకపోతే కొరకు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎంపీడీవో వై.వెంకటరమణ మాట్లాడుతూ ట్రెజరీకు బిల్లులు పెడుతున్నామని, ప్రభుత్వం నుండి నిధులు రావాల్సి ఉన్నాయన్నారు. ఎంపీపీ డొక్కరి దానయ్య మాట్లాడుతూ ఎంపీటీసీల గౌరవ వేతనాలు బకాయిలు ఉండడం దురదృష్టకరమన్నారు. ఎంపీటీసీల నిర్ణయానికి తాను కూడా కట్టుబడి ఉంటానని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 కొర్నాని ఆదినారాయణ, ఏఓ బూరగాన రుషేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546